# కోరిక తీరిన వేళ

**మందరపు ఉమాలక్ష్మి**

అప్పటికే రాత్రి పది గంటలవడంతో, మధు గాబరాగా ఇంటికి వచ్చాడు వీధి తలుపు గడియ పెట్టి ఉండడంతో కాలింగ్ బెల్ మ్రోగించాడు

అంతవరకు భర్త రాక కోసం, ఎదురు చూసిన రజని, అప్పుడే ఒక కునుకు తీసింది

మధు మరి రెండు సార్లు, బజర్ మ్రోగించే సరికి, ఉలిక్కిపడి లేచి, తలుపు తీసింది

'ఇంట్లో అందరూ మొద్దు నిద్రపోయారా! అవతల గంట నుండి బజర్ మ్రోగిస్తుంటే వినబడలేదా!" అన్నాడు షర్టు విప్పి స్టేండు కొక్కానికి తగిలిస్తూ!

'ఇప్పుడే నిద్ర పట్టేసింది ముందు మీరు కాళ్ళు కడుక్కొని రండి భోజనం వడ్డిస్తాను" అంది శాంతంగా.

"అమ్మేది, స్వప్నేది? ఇద్దరూ ఎక్కడికి వెళ్ళారు?"

'ఆవిడ చెడ్డదే కాకుండా, స్వప్నని కూడా చెడగొడుతుంది ఈ వయసులో కృష్ణా; రామా అంటూ, ఒక దగ్గర పడుండకుండా, ఆ తిరుగుళ్ళేమిటి?' విసుగ్గా అంది రజని

"ఎక్కడికి వెళ్ళిందో చెప్పకుండా అలా చిరాకు పడతావేం?"

"శంకరమఠంలో ఎవరిదో వీణ కచేరీ ఉందట! సాయంత్రం ఆరు గంటలకి వెళ్ళిపోయారు -ఇంతవరకు అయిపులేరు ఇద్దరూ!

"అమ్మ మళ్ళీ కచేరీకి ఎళ్ళిందా! అసలే ఆవిడ ఆరోగ్యం బాగుండదు ఇప్పుడా కచేరీకి ఎందుకు వెళ్ళనిచ్చావు?"

మీరన్న మాట మరీ బాగుంది నేను వెళ్ళమంటే వెళ్తుందా! వద్దంటే మానేస్తుందా! మూతి మూడు వంకర్లు తిప్పుతూ అంది రజని

అప్పుడే గుమ్మంలోకి అడుగు పెడుతున్న సావిత్రమ్మ వాళ్ళ మాటలు విని, దీర్ఘంగా నిట్టూర్చి, లోపలకి నడవబోయింది

'అమ్మా! ఆకలేస్తుందే! అన్నం పెట్టు' అంది తల్లి కొంగు పట్టుకు లాగుతూ స్వప్న.

"అమ్మా! మళ్ళీ నువ్వు కచేరీకి వెళ్ళేవా? నీకెన్ని సార్లు చెప్పాలి. అసలే అనారోగ్యం మనిషివి ఇప్పుడా సంగీతం వినకపోతే వచ్చిన నష్టమేమిటి? నువ్వి లాగే సంగీత కచేరీలకి, గుళ్ళకి గోపురాలకి తిరుగుతుంటు నేను నీ ఆరోగ్యం కోసం డాక్టర్ల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తాను మందలించినట్లు అన్నాడు మధు

"అదికాదురా! ఈ వేళ శంకర మఠంలో ఎంత మంచి కచేరీ జరిగిందనుకున్నావు అతని వీణా వాదనలో సర్వం మరచిపోయానంటే నమ్ము ఈ జన్మకి సంగీతం నేర్చుకునే అదృష్టం ఎలాగూ లేదు కనీసం మంచి సంగీతాన్ని వినే యోగమైనా నాకు లేదా! అంది బాధగా

ఎంత సేపూ నీకు సంగీతం పిచ్చే గానీ, మనుష్యుల కష్టసుఖాలు అర్థం చేసుకోవేం? ఇప్పుడా సంగీతం సంగతెందుకు గాని, ముందు కాస్త అన్నం తిను 'అన్నాడు

నాకు ఆకలిగా లేదురా!" అని తన మంచం వైపు నడిచింది

ఇక ఆమెతో వాదన పెంచుకుంటే, తల్లి మనసు గాయపడుతుందన్న, అక్కడితో సంబాషణ ఆపి, లోపలకి నడిచాడు మధు

సావిత్రమ్మ నెమ్మదిగా మంచం మీద మేను వాల్చింది ఆమె మనసు నిండా అంతులేని ఆవేదన రజని అన్న మాటలకు ఆమె హృదయం, తూట్లు తూట్లు పడింది. రజని ఎంత మాట అంది? తను స్వప్నని చెడగొడుతుందా! సంగీత కచేరీకి వెళ్ళినంత మాత్రాన తను బలాదూర్ లాగ తిరుగుతుందా! కనీసం తన కన్నా పెద్దదాన్నన్న గౌరవమైనా లేకుండా ఎలా మాట్లాడుతుంది?

రజని మాటలకి తాళం వేస్తూ, తాటికాయ లాగ బుర్ర ఊపుతున్నాడు మదు ఎంత సేపూ తన ఆరోగ్యం బాగులేదని అంటాడే గాని, ఏ నాడైనా తన మనసు పొరల్లోకి తొంగి చూశాడా! తను దేని కోసం తపించిపోతుందో ఒక్క నాడైనా తెలుసుకున్నాడా!

హుం వాడెందుకు తెలుసుకుంటాడు? లోకం ఏమంటుందో నన్న భయంతో, తనని ఇంటికి కాపలాగ పడి ఉండమంటున్నాడు ఏం? భార్యా భర్తలిద్దరూ, వారానికి ఒక సినిమాకి వెళ్ళరూ! ఈలోగా ఎప్పుడన్నా ఖాళీ ఉంటే, అలా బీచ్‌కి, బజారుకి వెళ్ళరూ! తను ఎక్కడికి వెళ్ళాలి? ఏ నాడన్నా తను సినిమా చూస్తానందు! ఎప్పుడో చిన్నప్పుడు పెళ్ళైన కొత్తలో నాలుగైదు సినిమాలు చూసిందంతే! తర్వాత తనకి సినిమాలు చూసే తీరికా లేదు భర్త తనను తీసుకు వెళ్ళిందీ లేదు.

తను వాళ్ళ లాగ సినిమాలకి, షికార్లకి వెళ్తుందా! తనకి సంగీత మంటే ఎంతో ఇష్టం చిన్నప్పటి నుండి ఎక్కడ సంగీత్ సభ జరిగితే, అక్కడ రెక్కలు కట్టుకొని వాలిపోయేది

ఈ వేళ తను ఒక మహావిద్వాంసుడి వీణా వాదన విన్నాది ఆ కచేరీ మూడు గంటలు విన్నా, ఇంకా వినాలనే ఉంది. అసలు సంగీతంలో మాధుర్యం వీళ్ళకెలా తెలుస్తుంది? తను సంగీతం గురించి చెప్పినా వీళ్ళకి అర్థం అయి చావదు. తను చిన్నప్పుడు దొంగతనంగా, వాళ్ళ కాళ్ళు, వీళ్ళ కాళ్ళు పట్టుకొని, వర్ణాల వరకు నేర్చుకుంది ఆ తర్వాత తను ఎంత ప్రయత్నించినా సంగీతం నేర్చుకోవడం అవలేదు.

ఆమె మనసు గతంలోకి పరుగులు తీసింది

అప్పుడు తనకి ఆరేళ్ళ వయసు

ఆ రోజు ఇంట్లో అంతా సందడిగా వుంది అప్పటికే చుట్టాలందరూ వచ్చేసారు కొత్త పెళ్ళి కొడుకులా ముస్తాబయ్యాడు నాన్న ఆ రోజు అమ్మమ్మ తనని పట్టుకొని ఏడ్చేసింది

'అమ్మమ్మా! ఎందుకేడుస్తున్నావు? నాన్న ఎంచక్కా పెళ్ళి చేసుకుంటున్నాడట! నాకు కొత్త అమ్మ వస్తుంది ' అంది తను సంతోషంగా

"అదేనే నీ ఖర్మ! నీ తర్వాత ఒక్క మగ నలుసు పుట్టినా, మీ నాన్నని ఈ పని చెయ్యనిచ్చేదాన్ని కాదు రేపటి నుండి నువ్వు ఆ సవతి తల్లి పెంపకంలో ఎన్ని బాధలు పడాలో తలచుకుంటేనే గుండె తరుక్కుపోతుంది ' అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ!

"అమ్మమ్మా! ఈ క్రొత్తమ్మ నన్ను కొడుతుందా! బేలగా అడిగింది

"ఎందుకు కొడుతుంది? మీ నాన్న లేడనా! అయినా నిన్ను నాతో బాటు తీసుకు పోతానంటే, మీ నాన్న ఒప్పుకోవడం లేదు ఇక ఏం చేసినా ఆ దేవుడిదే భారం అని నిట్టూర్చింది

ఇంతలో అమ్మమ్మని ఎవరో పిలవడంతో అటు వెళ్ళిపోయింది

* * * *

తనకి పదేళ్ళు వచ్చాయి

మొదట్లో కొత్తమ్మ తనని బాగానే చూసేది తనకి తమ్ముడు చెల్లి పుట్టేక తన మీద ఎందుకో పిన్నికి కోపం పెరిగిపోయింది చీటికి, మాటికి తనని కొట్టడం, తిట్టడం మొదలు పెట్టింది

పిన్ని ఆరళ్ళల్లో తను ఎలాగో ఐదో క్లాసు వరకు చదువుకుంది ఇంట్లో సరియైన భోజనం లేకపోవడం వల్ల, వయసుకి మించిన పనులు చేస్తుండడం వల్ల, తనకి చదువు మీద శ్రద్ధ తగ్గిపోసాగింది ఒక్కోసారి ఈ బాధలు పడే కన్నా, తనూ చచ్చిపోయి అమ్మ దగ్గరకి వెళ్ళిపోతే బాగుండుననిపించేది కానీ ఆ వయసులో తనకి ఆత్మహత్య చేసుకునేందుకు ధైర్యం చాలేదికాదు అందుకే తనకీ జీవితం నుండి విముక్తి ప్రసాదించమని ప్రతి రోజూ ఆ భగవంతుడిని వేడుకునేది.

ఆ దేవుడికి దయలేదు తనకి చావు రాలేదు కానీ తనకి యవ్వనం వచ్చేసింది తన చదువు ఐదో క్లాసుతోనే ఆగిపోయింది. ఇంతలో నాన్న పోవడంతో, తన బ్రతుకు మరీ దుర్భరం అయిపోయింది

ఎంత సేపూ, ఇంటి పని, వంట పని,

బట్టలుతకడం, ఏటి నుండి నీళ్ళు తేవడంతో నే తనకి రోజు గడిచిపోయేది

రోజులు నిర్లిప్తంగా దొర్లిపోతున్నాయి

అప్పుడే తమ ప్రక్కింట్లో ఒక డాక్టరు గారు అద్దెకి దిగారు వాళ్ళ అమ్మాయికి సంగీతం చెప్పిస్తుంటే తను చాటుగా వినేది. క్రమక్రమంగా ఆ అమ్మాయితో స్నేహం పెంచుకుంది ఆ సంగీతం వింటుంటే తనకి ఒళ్ళు పులకరించి నట్లయి పోయేది

సంగీతం మాష్టారు వచ్చే సమయానికి తనూ వాళ్ళింటికి వెళ్ళి కూర్చునేది తను కూడా ఆ అమ్మాయితో గొంతు కలిపి పాడేది ఆ అమ్మాయి వీణ వాయిస్తుంటే, అబ్బురంగా చూసేది

ఇంట్లో పనంతా చకచకా చేసుకొని, సంగీతం మాష్టారు వచ్చేసరికి వాళ్ళింటికి వెళ్ళిపోయేది

పిన్నికి ఈ సంగతి ఎలా తెలిసిందో, తనని ఆ ఇంటి గడప త్రొక్కవద్దని శాసించింది "నీ బ్రతుక్కి ఇంక సంగీతం ఒక్కటే తక్కువ వెళ్ళి ఇంట్లో పని చూడు " అని కసురుకునేది.

తమ్ముడు, చెల్లి కూడా తనని చూసి ఎగతాళి చేసేవారు వాళ్ళ దృష్టిలో తను జీతం, బత్తెం లేని పనిమనిషి తనకు సంగీతం నేర్చుకోలేకపోయి నందుకు ఏడుపు వచ్చేది

తల్లి, తండ్రి లేని తనకి ఎవరు సంగీతం చెప్పిస్తారు తను జీవితాంతం, ఈ ఇంటికి ఊడిగం చేసుకునే బ్రతకాలి కాబోలు అన్న ఊహ వచ్చినప్పుడు, తన మేను భయంతో సన్నగా కంపించేది

ఆ తర్వాత కొంత కాలానికి, తనకి అనుకోకుండా సంబంధం కుదరడంతో, పిన్నికి ఇష్టం లేకపోయినా, పెళ్ళి చెయ్యక తప్పలేదు

ఇక జీవితంలో పెళ్ళే కాదేమోనన్న తనకి, పెళ్ళి జరగడం చాలా ఆనందాన్ని కలిగించింది తనలో అణగారిపోయిన కోర్కెలు పడగవిప్పి నాట్యం చేసాయి. కోటి కోర్కెలతో, భవిష్యత్తు మీద కొండంత ఆశతో తను ఆ ఇంట్లోకి అడుగు పెట్టింది

కానీ తనది రెండో వివాహమని, తన భర్త ముగ్గురు పిల్లల తండ్రి అని తెలుసుకున్నప్పుడు, తన గుండె భయంతో స్పందించింది ఒక సవతి తల్లి బారి నుండి విముక్తి పొందిన తను, మళ్ళీ మరొక తల్లి బిడ్డలకి సవతి తల్లి కాబోతుందా! ఆ బిడ్డలు తనని తల్లిగా గౌరవిస్తారా! తను వాళ్ళనేమీ ఆరళ్ళు పెట్టదు కానీ కానీ సవతి తల్లి అని నలుగురూ అంటుంటే, తన మనసు ముక్కలై పోదూ!

తన మనసు పరిపరి విధాల పోయేది కానీ తను భయపడిన విధంగా జరగలేదు పిల్లలకి తనంటే ప్రాణం భర్తకి తనంటే అమితమైన ప్రేమ. భర్త, పిల్లల ఆలన, పాలనలో తను సర్వం మరచి పోయేది

పెళ్ళి అయ్యాక అన్నా సంగీతం నేర్చుకోవాలన్న తన ఆశ అడియాసే అయ్యింది పిల్లల సంరక్షణలో తనకి క్షణం తీరిక ఉండేది కాదు ఈ లోగా రెండు సార్లు తనకి నెల తప్పడం, రెండు కాన్పులు పోవడంతో, తన మనసు బాధతో నలిగిపోయింది.

తను సవతి తల్లే గాని, ఏ నాడూ పిల్లల్ని నిర్లక్ష్యంగా చూడలేదు. ఏ స్త్రీకయినా, తను తల్లి కావాలనే కోరిక ఉంటుంది. కానీ తనకి జన్మలో ఆ అదృష్టం లేదని కుమిలి పోయేది



భర్త తనని ఓదార్చేవాడు ఈ బిడ్డల్లోనే తన బిడ్డని చూసుకోమని నచ్చజెప్పేవాడు కానీ తనకే ఎందుకో తల్లి కాలేకపోయాననే బెంగ

తన అదృష్టం పండిందేమో అన్నట్లు, తనకి మళ్ళీ నెల తప్పింది ఈ సారైనా తనకి బిడ్డ దక్కేటట్లు చెయ్యమని, వెయ్యి దేముళ్ళకి మ్రొక్కుకుంది

ఆ దేవుడు తన మొర ఆలకించాడో, లేక తన అదృష్టమో గాని, అతికష్టం మీద పండంటి మగబిడ్డ పుట్టాడు కానీ ఆ తర్వాత తనకి పిల్లలు పుట్టకూడదని, పిల్లలు పుడితే, ప్రాణాలకే నష్టం అని డాక్టర్లు చెప్పడంతో, తనకి ఆపరేషన్ చేయించేసారు

మధు పుట్టాక, తన మనసు కాస్త కుదుటపడింది

కాలగమనంలో పిల్లలు కొంచెం పెద్ద వాళ్ళయ్యారు

పిల్లలందరూ స్కూలుకి వెళ్ళిపోవడంతో తనకి ఇంట్లో ఏమీ తోచేది కాదు అందుకే అప్పుడు తన మనసులో కోరిక బయటపెట్టింది

ఏమండీ' నేను వీణ నేర్చుకుంటాను అని నోరు విడిచి అడిగింది

ఆ మాట వినడంతోనే అతడి మనసు భయంతో కంపించి పోయింది 'వద్దు సావిత్రీ' నువ్వు సంగీతం నేర్చుకోవద్దు ఈ సంగీతం పిచ్చిలో పడే, నన్ను పిల్లల్ని అలక్ష్యం చేసింది అనసూయ తను ఒక గొప్ప కళాకారిణి కావాలని అహర్నిశాలు, సంగీత సాధన చేసింది తనకి అనారోగ్యంగా ఉన్నా పట్టించుకొనేది కాదు సంగీత సాధనే తన లక్ష్యం అనేది చివరికి . ఏవరికి ఎవరికీ అందనంత దూరం వెళ్ళిపోయింది అతడి కంఠం రుద్ధమైంది

వింటున్న తన కళ్ళల్లో అప్రయత్నంగా నీళ్ళూరాయి

'సావిత్రీ' నువ్వు వచ్చాక ఈ ఇంట్లో ఆనందం తాండవిస్తుంది అనసూయ పోయిందన్న దిగులు నుండి పూర్తిగా కోలుకున్నాను. అనసూయ కన్నా, వేయి రెట్లు అధికంగా నన్ను నా బిడ్డల్ని కళ్ళల్లో

# కోరిక తీరిన వేళ

పెట్టి చూసుకున్నావు. ఇప్పుడు సంగీతం ధ్యాసలో పడిపోయావంటే, నువ్వు అనసూయ లాగే మారిపోతావు నేను బ్రతికి ఉన్నంత వరకు ఆ ప్రసక్తి తీసుకురాకు అన్నారు శాసిస్తున్నట్లు

భర్త అనురాగం ముందు, పిల్లల ముద్దు ముచ్చట్ల ముందు తనకి సంగీతం రాలేదన్న బాధ తాత్కాలికంగా మరచిపోగలిగింది

కానీ ఎక్కడ సంగీత్ సభలు జరిగినా, తనని తీసుకు వెళ్ళే వారు ఈ జన్మకి అదృష్టం చాలని తృప్తి పడేది తను ఆయన ఇష్టంలేని విద్య, పిల్లల కెవ్వరికి నేర్పడానికి ఆయన ఒప్పుకోలేదు ఇక తన ఆశని తనలోనే సమాధి చేసుకోక తప్పింది కాదు

పిల్లలు పెరిగి పెద్ద వాళ్ళయ్యారు

ముగ్గురాడ పిల్లలకి పెళ్ళిళ్ళు చేసి అత్తవారింటికి పంపేసారు మధు ఉద్యోగస్తుడయ్యాడని, మధుకి కూడా పెళ్ళి జరిపించేసారు కర్తవ్యాలని నిర్వర్తించి, ఆయన కన్ను మూసారు

భర్త పోయిన తర్వాత తనకి లోకమంతా చీకటిగా అనిపించింది మధుకి ఆ ఊరు నుండి ట్రాన్సఫర్ అవడంతో, తనని తీసుకొని, వెళ్ళిపోయాడు ఆయన జ్ఞాపకాలని, ఆ ఊరిని వదలి దూరంగా వెళ్ళిపోయాను మధుతో

కోడలు రజని-తనని బాగానే చూసుకుంటుంది కానీ కొంచెం కోపం జాస్తి అందుకే ఇప్పటికీ, వంటపని, తనే చూసుకుంటుంది కొడుకు, కోడలు, ఇద్దరూ ఉద్యోగం చెయ్యడానికి ప్రొద్దున్న పది గంటలకి వెళ్ళిపోతే, సాయంత్రానికి గాని, తిరిగి వచ్చేవారు కాదు మధు అయితే రాత్రి ఎనిమిది 'అయితే గాని ఇంటికి రాడు

ఇంటి దగ్గర స్వప్నని, కిరణ్‌ని తను చూసుకునేది వాళ్ళిద్దరూ నాన్నమ్మ అని తన చుట్టూ తిరుగుతుంటే తనకి తెలియని ఆనందంగా ఉండేది.

స్వప్నకైనా వీణ నేర్పించాలని, ఆ చిన్నారి చేతుల్తో వీణ వాయిస్తుంటే చూడాలని, తను ఎంతగానో ఉబలాటపడేది. సమయం చూసి ఈ విషయం మధుతో చెప్పాలని, రజనిని స్వప్నకి సంగీతం నేర్పించమని అడగాలని అనుకుంది

కానీ. . రజని మనసులో సంగీతం అంటే ఎంత ద్వేషముందో ఈ వేళే తెలుసుకుంది ఇక స్వప్నకి సంగీతం నేర్పిస్తుందన్న ఆశ తనకే మాత్రం లేదు.

తనకి తీరిక దొరికినప్పుడు, స్వప్నని కూర్చోబెట్టి, సరిగమ పదనిసలు పాడించేది స్వప్నకి పదేళ్ళే అయినా ఎంతో చక్కగా గ్రహించేది అందుకే దాన్ని తన వెంట సంగీత కచేరీలకి తీసుకు వెళ్ళేది? సంగీతం వింటుంటే స్వప్నకి ఇంకా బాగా జ్ఞానం వస్తుందని, అది ఒక గొప్ప సంగీత విద్వాంసురాలు కావాలని కలలు కనేది

కానీ జరిగిందేమిటి? రజని తనని దూషిస్తుంది తన కూతురిని చెడగొడుతున్నానని, దెప్పి పొడుస్తుంది తనకి ఎలాగూ సంగీతం నేర్చుకునే అదృష్టం లేదు కనీసం స్వప్నకైనా చెప్పించాలని తాపత్రయ పడింది కానీ తన ఆశ మొదట్లోనే అడుగంటి పోయింది

ఇక ఈ జన్మకింతే! తమ వంశంలో సంగీతం వినిపించదు ఇక నుండి తనని సంగీత్ సభలకి కూడా వెళ్ళనివ్వరేమో! ఏది ఎలా జరిగినా తనేం చెయ్యగలదు? తనలోని కళాతృష్ణని, వేళ్ళతో పెకలించి పారవెయ్యలేదే ఇక తనకి ఆ భగవంతుడి దగ్గర నుండి పిలుపు వస్తే, ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోవడం తప్ప తనేం చెయ్యగలదు?

ఆలోచిస్తున్న సావిత్రమ్మ కళ్ళల్లోంచి, రెండు కన్నీటి బొట్లు జలజలా రాలాయి. కలతబారిన మనసుతో, ఎప్పటికి నిద్రపోయింది సావిత్రమ్మ.

తెల్లవారుతుంది అన్నట్లు, వేకువ జామున నాలుగు గంటలకే కోడి కూత వినబడడంతో, మంచం మీద నుండి లేచింది సావిత్రమ్మ

* * * * * * *

ఇంతలో పెరట్లో నుండి స్వప్న సంగీతం పాడుతున్నట్లు వినిపిస్తే ఆశ్చర్యపోయి అటు నడిచింది. సప్త స్వరాలు వీనుల విందుగా వినిపిస్తుంటే, తన చెవులని తానే నమ్మలేక పెరట్లోకి పరుగు లాంటి నడకతో వెళ్ళింది.


అక్కడ చలిలో, నూతి గట్టు దగ్గర కూర్చుని, స్వప్న సరిగమలు పాడుతోంది.

ఆ దృశ్యాన్ని చూసిన సావిత్రమ్మ గుండె సంతోషంతో పొంగి పోయింది. వడివడిగా స్వప్న దగ్గరకి నడిచి "స్వప్నా నా బంగారు తల్లీ! ఈ చలిలో సంగీతం పాడుతున్నావామ్మా!" అంది ఆనందంగా.


"ఔను నాన్నమ్మ! చలిలో పాడితే సంగీతం బాగా వస్తుందని నువ్వే చెప్పావుగా! ఎప్పటికైనా నేను మంచి విద్వాంసురాలినౌతాను." అంది స్వప్న అమాయకంగా

"స్వప్నా! నా తల్లీ ఎంత మంచి మాటన్నావు. కానీ... కానీ... ఈ సంగతి మీ అమ్మకి, నాన్నకి తెలిస్తే ఊరుకుంటారా" అంది సందేహంగా

"నాకు సంగీతం నేర్పించకపోతే, నేను అన్నం



## ధర్మక్షేత్రం




# సుప్రభాతాన్ని గురించి

మనం సాధారణంగా ఉదయం రేడియోలో "సుప్రభాతం" వింటూ ఉంటాము. వీటిలో శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమే ప్రధానమైనదీ, ప్రాచీనమైనదిన్నీ. ఇది ఎంతో ప్రచారాన్ని పొందింది. చాలా మందికి ఇది కంఠస్థమై కూడా ఉంటున్నది. దీనిని అనుసరించే మల్లికార్జున సుప్రభాతం, సింహాచలంలోని నృసింహదేవ సుప్రభాతం మొదలైన సుప్రభాతాలు రచింపబడి, ప్రచారాన్ని పొందుతున్నాయి.

గౌరవనీయులు, పెద్దలు వచ్చినప్పుడు వారిని గౌరవ మర్యాదలతో ఆహ్వానించేటప్పుడు 'స్వాగతం' చెప్పడం పరిపాటి. ఆ రీతిగానే రాత్రి నిద్రిస్తున్న మహనీయులకు ప్రభాత సమయంలో మేలుకొలుపు పలకడం సుప్రభాతం! ఈ ప్రభాతం శుభకరమై ఉండుగాక! అని కోరడమే సుప్రభాతపు ఆశయంగా తోస్తున్నది.

"భగవంతుని గూర్చి మనం సుప్రభాతం చెప్తున్నాం. సర్వ కాల, సర్వావస్థల్లోనూ జాగరూకుడై ఉండి, సర్వ లోకాలనూ రక్షిస్తూ ఉన్న భగవంతునికి నిద్ర యెక్కడిది? అతనికి మనం మేలుకొలుపు పాడడం సముచితమేనా? నిద్రాణులమై వుండే మనకే మేలుకొలుపు కావలసి ఉన్నది. మనం భగవంతుణ్ణి మేలు కొలపడం మన అవివేకాన్నే సూచిస్తుంది" అని కొందరి అభిప్రాయం. ఇదీ కొంత ఆలోచింపదగినదే!

బాగా ఆలోచించి చూస్తే దీనికి సమాధానం దొరకకపోదు.

భగవంతునికి గుణాలనూ, నామ రూపాలనూ కల్పించి వేర్వేరు దేవతా మూర్తులుగా భావించి ఆరాధించేటప్పుడు షోడశోపచారాలతోనూ పూజలు చేస్తున్నాము. కల్యాణాలు జరుపుతున్నాము. వైభవోపేతంగా ఊరేగింపులు నిర్వహిస్తూ ఉన్నాము. ఆయా గుణాలను కీర్తిస్తూ పాటలు పాడుతున్నాము. రాత్రి పవ్వళింపులు పాటలతో కూడా జరుపుతున్నాము. దేవుణ్ణి మన మధ్య వున్న విశిష్ట వ్యక్తిగా భావించి అధికంగా అవయవాలను కల్పిస్తున్నాము. ఇట్టి స్థితిలో మేలు కొలుపులు పాడడం కూడా ఉచితంగానే ఉంటుంది.

నిర్గుణ స్వరూపుడైన పరమాత్మను తమ హృదయంలోనే నిలిపి ధ్యానించే యోగి పుంగవులకు ఇట్టి ఆరాధనలతో పని ఉండదు. కాని దేవాలయాల్లో ప్రతిష్ఠించి, సమస్తోపచారాలతో పూజిస్తున్న ఇతరులకు 'సుప్రభాతం' కూడా ఒక పూజాంగంగానే తోచక మానదు.

-బులుసు వేంకటరమణయ్య

---

తినను. బడి కెళ్ళను." మొండిగా అంది స్వప్న.

"నా తల్లే! నీకింత శ్రద్ధ ఉందని ఇప్పుడె తెలుసుకున్నాను. ఇక మీ నాన్నతో పోట్లాడి అయినా నీకు సంగీతం నేర్పిస్తాను." అని ఆయాసంతో మాట రాక ఉన్న చోటనే కూలబడిపోయింది.

స్వప్న గాబరాగా వెళ్ళి, తల్లిని, తండ్రిని నిద్ర లేపింది.

ఏం జరిగిందోనని గాబరాగా వచ్చిన మధు, అక్కడ తల్లి అచేతనంగా పడి ఉండే సరికి, రెండు చేతులతో లేవనెత్తి, అక్కడ నుండి తీసుకు వెళ్ళాడు.

సావిత్రమ్మ ఆయాసంతో మూలుగుతోంది.

మధు, తల్లిని మంచం మీద పడుకోబెట్టాడు. రజని ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది.

"మధు ... నాది... నాదొక కోరిక .. తీరుస్తావా!" అంది సావిత్రమ్మ అతిప్రయత్నం మీద.

"ఏమిటమ్మా!" ఆశ్చర్యంగా అడిగాడు.

"మన స్వప్నకి... సంగీతం నేర్పించరా!" అంది వగరుస్తూ.

"ఆ సంగతి ఇప్పుడెందుకమ్మా! నువ్వు ఎక్కువగా మాట్లాడకు ఆయాసం వస్తుంది." అన్నాడు మధు.

"మధూ! ఈ జీవితంలో నేను నిన్ను ఇంకేమీ కోరనురా! స్వప్నకి సంగీతం నేర్పిస్తానని నాకు మాట ఇవ్వరా!" బ్రతిమాలుతున్నట్లు అడిగింది.

"అది నేర్చుకోవాలే గాని, దానికి సంగీతం చెప్పించనని నే నెప్పుడన్నా అన్నానా! తప్పకుండా చెప్పిస్తానమ్మా!" అన్నాడు ఆమె చేతిలో చెయ్యి వేస్తూ!

"నాన్నమ్మా! నేను సంగీతం నేర్చుకుంటాను." స్వప్న ఏడుపు గొంతుతో అంది.

స్వప్న బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకొని, "నువ్వు పెద్ద విద్వాంసురాలవ్వాలి. అప్పుడే నా ఆత్మకు శాంతి." అని మెడ క్రిందకి వాల్చేసింది.

"నాన్నమ్మా!" అని ఆమె మీద పడి ఏడుస్తోంది స్వప్న.

మధు మనసు దుఃఖంతో మొద్దు బారిపోయింది. అతడి కళ్ళల్లోంచి అశ్రు బిందువులు రాలి, సావిత్రమ్మ పాదాల మీద పడ్డాయి.

తిరిగి రాని తల్లి కోసం, హృదయ విదారకంగా ఏడుస్తున్నాడు మధు. రజని కళ్ళల్లో కూడా కన్నీళ్ళు తిరిగాయి. □